# ప్రజాశక్తి

ఆదివారం 23 ఫిబ్రవరి 2025

8 పేజీలు







విశాఖపట్నం అనకాపల్లి


### ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఉద్యమ సారథి

# పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

- ఎమ్మెల్సీ బరిలో ఉన్న 10 మందిలో ఆమె ఒక్కరే మహిళ
- సర్వత్రా సానుకూలత
- తమది ఆడపడుచుల పార్టీ అంటూనే ఆమెను నిలువరించే ఎత్తుల్లో 'కూటమి'



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

శాసన మండలికి జరిగే ఎన్నికలు అత్యంత ప్రత్యేకమైనవి. ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి జరిగే ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వారిలో యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఉద్యమ సారథి అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఆమె పోరాట పథం సుదీర్ఘమైనది. అందుకే ఆమెను గెలిపించుకునే దిశగా గురువులు అడుగులు వేస్తున్నారు.

ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి మద్దతుతో ఎపిటిఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పిడిఎఫ్ నుంచి కోరెడ్ల విజయగౌరి, పిఆర్‌టియు బలపరిచిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. పాకలపాటి, గాదె పనితీరు గురించి ఉత్తరాంధ్రకు చెందిన టీచర్లందరిలోనూ ఒక అంచనా లేకపోలేదు. వారు ఈ ప్రాంత వాణిని, ఉపాధ్యాయుల సమస్యలను మండలిలో ఏనాడూ లేవనెత్తలేదు.

**ఉద్యమ వారసత్వం పిడిఎఫ్ సొంతం**

గతంలో పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలిచిన చుక్కా రామయ్య, విఠపు బాలసుబ్రమణ్యం, కెఎస్.లక్ష్మణరావు, ఐవి, ఎంవిఎస్.శర్మ తదితరుల పోరాట వారసత్వాన్ని విజయగౌరి గెలిస్తే ముందుకు తీసుకెళ్లనున్నారు. ఉమ్మడి మిగతా 2లో..



ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రూప్ 2 అభ్యర్థులు

# రోస్టర్‌పై రోడ్డెక్కారు

- విశాఖలో గ్రూపు 2 అభ్యర్థుల నిరసనల హోరు
- ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపై బైఠాయింపు
- ప్రభుత్వ వ్యతిరేక నినాదాల హోరు
- నేడు పరీక్షా కేంద్రాల వద్ద ధర్నాలకు పిలుపు



వాహనాలను అడ్డగించి నిరసన తెలుపుతూ..

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రోస్టర్ పాయింట్స్‌ను సవరించి గ్రూప్ 2 పరీక్షలను యధావిధిగా కొనసాగించాలని విశాఖలో అభ్యర్థులు తలపెట్టిన నిరసన శనివారానికి మూడో రోజుకు చేరింది. ఉదయం ఎంవిపి.కాలనీలోని ఆర్‌సి రెడ్డి స్టడీ సెంటర్ వద్ద ఆందోళన చేపట్టిన వారంతా సాయంత్రానికి పోరాటాన్ని ఉధృతం చేశారు. ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపైకి పెద్ద సంఖ్యలో తరలివచ్చి బైఠాయించారు. సాయంత్రం మిగతా 2లో..

## వెంకన్న ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

వార్త 8లో..

## గురువులు గుణపాఠం చెప్పాలి..!

వార్త 2లో..

## నేడు16 కేంద్రాల్లో గ్రూప్ 2 పరీక్ష: జెసి

వార్త 7లో..



విశాఖలో కలుసుకున్న తెలుగు రాష్ట్రాల్లోని కవలలు

# ఒకే చోట కవలల సందడి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఇటు ఆంధ్ర, అటు తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 50 మంది కవలలు నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సందడి చేశారు. ట్విన్స్ డే సందర్భంగా డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో వారంతా శనివారం కలుసుకున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే రూపంతో ఇద్దరు మనుషులు ఉండడం, ఒకేసారి ఇంతమంది కవలలను చూడటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమాన్ని ఆర్గనైజ్ చేసిన విశాఖపట్నానికి చెందిన రామ్ లక్ష్మణ్, సోంపేటకు చెందిన రామరాజు లక్ష్మరాజులను అభినందించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత ఆలోచనలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో జివిఎంసి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, త్రివేణి సునీల్, రామకృష్ణ పాల్గొన్నారు.

# బడ్జెట్‌పై వామపక్షాల నిరసన

### ప్రజా వ్యతిరేకం, కార్పొరేట్ అనుకూలమని నేతల ఆగ్రహం

**ప్రజాశక్తి - అనకాపల్లి :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ శనివారం నెహ్రూ చౌక్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ చట్టంలో రూ.60 వేల కోట్లు మేర బడ్జెట్‌లో కోత విధించారని, పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విద్య, వైద్య రంగాల్లోనూ, వ్యవసాయ రంగానికీ తగిన కేటాయింపులు లేవని అన్నారు. కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు ప్రయోజనం




అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

కలిగే విధంగా బడ్జెట్‌లో అనేక రాయితీలు కల్పించారని విమర్శించారు. వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్‌గా దీన్ని మోడీ ప్రభుత్వం వర్ణించడం పచ్చి మోసమని, ఈ బడ్జెట్ చీకటి భారత్‌ను నిర్మించేదని విమర్శించారు. ఇటీవల అమెరికా వెళ్లిన ప్రధాని మోడీ భారతదేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి అమెరికాతో రూ.5 లక్షల కోట్ల మేర చమురు ఉత్పత్తులు, యుద్ధ విమానాల ఒప్పందాలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఉద్యమ సారథి పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

రాష్ట్రంలోనూ, విభజిత ఎపిలోనూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలంతా ప్రజా సమస్యలు, మహిళా సమస్యలు, ఉపాధ్యాయ, పట్టభద్రుల సమస్యలపై మండలిలో గళమెత్తినవారే. ఆ మేధావుల మద్దతు విజయగౌరికి ఉంది. ప్రత్యేకించి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మహిళా టీచర్లలో విజయగౌరి అభ్యర్థిత్వం పట్ల మంచి సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రచారం సందర్భంగా తమ కోసం పోరాడే ఒక ఉద్యమ నేత, తమకు తెలిసిన వ్యక్తే పిడిఎఫ్ అభ్యర్థిగా ఉన్నారన్న ఆశాభావాన్ని పెక్కు మంది వ్యక్తం చేస్తున్నారు. గతంలో శాసన మండలిలో కల్పలతా రెడ్డి మహిళా ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా రాష్ట్రంలో గెలిచి అడుగుపెట్టినా ఆమె ఏ సమస్యపైనా మాట్లాడిన దాఖలా లేదు. ఉత్తరాంధ్ర నుంచి మండలికి పిడిఎఫ్ తరపున బరిలోకి దిగిన కోరెడ్ల విజయగౌరి గత 20 ఏళ్లకుపైగా విద్యా రంగ పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ పలు స్కూళ్లలో ఉపాధ్యాయురాలిగా విధులను నిర్వర్తిస్తూ మంచి ఉపాధ్యాయినిగా పేరు తెచ్చుకున్నారు. టీచర్ల సమస్యలపై రాష్ట్ర స్థాయిలో గళమెత్తి ఉద్యమాల్లో అగ్రపీఠిన నిలిచిన చరిత్ర ఆమెది. అందుకే ఈసారి ఆమెను గెలిపించుకోవాలన్న కాంక్ష మహిళా ఉపాధ్యాయుల్లో కనిపిస్తోంది.

**పెద్దల సభకు మేధావులు.. ప్రశ్నించేవారే..**

పెద్దల సభగా పేరుగాంచిన శాసన మండలికి సమస్యలపై అవగాహన ఉండి, పోరాటాల్లో అనుభవంగలవారు, ప్రశ్నించేవారు, ప్రభుత్వాలకు మంచి సలహాలు అందించే వారినే ఎన్నుకోవాలి. ఉత్తరాంధ్ర అంతటా సుమారు 80 లక్షలకు పైగా జనాభా ఉంటే ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లుగా ఉండే 22493 మంది మాత్రమే తాజా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు. కాబట్టి విజ్ఞులైన ఉపాధ్యాయులు, వీరిలోగల సాహితీ వేత్తలు, కవులు, రచయితలు, మేధావులు అంతా పెద్దల సభ 'శాసన మండలి' విషయంలో ఆచితూచి అడుగు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

**ఒక్క మహిళను ఓడించేందుకు కూటమి పాట్లు**

ఆడపడుచుల కోసం తమ పార్టీ పుట్టిందని చెప్పుకునే తెలుగుదేశం పిడిఎఫ్ నుంచి కోరెడ్ల విజయగౌరి అభ్యర్థిత్వాన్ని సహించలేకపోతుండడం గమనార్హం. అధికార తెలుగుదేశం, జనసేన ఒకవైపు, బిజెపి మరోవైపు ఆమెను ఓడించేందుకు ఎత్తులు వేస్తున్నాయి. టిడిపి రాష్ట్ర నాయకత్వం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆ పార్టీ కార్యాలయాల్లో గడిచిన వారం రోజులుగా సమీక్షలు జరుపుతూ మంత్రులు, ఎంఎల్‌ఎలు, మండల, జిల్లా నాయకత్వాలను బరిలోకి దించేసి ఓట్ల కోసం ఉపాధ్యాయుల ముంగిటకొచ్చి విన్యాసాలు ప్రదర్శిస్తున్నాయి. ప్రలోభాలు, బెదిరింపులకూ రానున్న కాలంలో కూటమి దిగనుంది. అదే సమయంలో అవగాహన, అనుభవం కలిగిన టీచర్లంతా వీటిని పసిగట్టి తిప్పికొట్టేందుకు సిద్ధమౌతున్నారు.

## రోస్టర్‌పై రోడ్డెక్కారు

7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ వారి ఆందోళన కొనసాగింది. తమ ఆందోళనను పట్టించుకోకుండా గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు ఎపిపిఎస్‌సి సిద్ధమవుతుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ తీరుపై పెద్దపెట్టున నినదించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ సిఎం డౌన్ డౌన్ అని నినదిస్తూ జాతీయ రహదారిపైనే పడుకున్నారు. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించినా అభ్యర్థులెవ్వరూ బెదిరిపోకుండా పట్టుదలతో ఆందోళనను కొనసాగించారు. రోడ్డుపై పడుకున్న ఆందోళనకారులను పోలీసులు పక్కకు ఈడ్చుకెళ్తే అంతకు రెట్టింపు మంది వచ్చి అక్కడే బైఠాయించడం వారి పోరాట ఉధృతికి నిదర్శనంగా కనిపించింది. పరీక్ష రాయకపోయినా, అరెస్టులు అయినా జీవితాలు పోతాయన్న ప్రభుత్వ, పోలీసు బెదిరింపులేవీ అక్కడ పనిచేయలేదు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. తమ ఆందోళనను ఆదివారమూ కొనసాగిస్తామని, అందులో భాగంగా పరీక్షా కేంద్రాల వద్ద ధర్నాలు చేపడతామని అభ్యర్థులు తెలిపారు. జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# గురువులు గుణపాఠం చెప్పాలి..!

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

నిరుద్యోగులు, ఉపాధ్యాయుల తరపున మండలిలో మాట్లాడతానని నమ్మబలికి, ఇప్పుడు గ్రూపు-2 అభ్యర్థుల రోస్టర్ విధానంపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మౌనందాల్చారు. పదవి కోసం పట్టభద్రులను వంచించారు. మాట నమ్మి గెలిపించి మోసపోయామని ఇప్పుడు పట్టభద్రులు బాధపడుతున్నారు. రోస్టర్‌ను సవరించే వరకూ గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలని అభ్యర్థులు వీధుల్లోకి వచ్చారు. అభ్యర్థుల అభ్యర్థనను పట్టించుకోని చిరంజీవిరావు రాజీనామా చేయాలంటూ వారంతా పెద్ద ఎత్తున విశాఖ కేంద్రంగా మూడు రోజులపాటు నిరసన తెలిపారు. తనకీ గౌరవం తెచ్చిపెట్టిన పట్టభద్రుల్లో భాగమైన గ్రూపు-2 అభ్యర్థులకు కనీస ధైర్యం, భరోసాను ఆయన ఇవ్వలేకపోయారు. ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి న్యాయం చేస్తానని చెప్పలేకపోయారు. పాలకపక్ష పక్షపాతికి పదవికి కట్టబెడితే ప్రయోజనం కంటే నష్టం ఎక్కువగా వుంటుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా పనిచేసే వ్యక్తులను కాకుండా ప్రజల మేలుకోరి పనిచేసే పోరాట నేపథ్యం కలిగిన శ్రేయోభిలాషులను ఎన్నుకోవడమే సముచితం. తమ కోసం పనిచేసే వారెవరు ? ఇచ్చిన అవకాశాన్ని సొంతానికి ఉపయోగించుకొనేదెవరు ? గెలిపించిన జనం కోసం పనిచేసేదెవరు ? పనిచేస్తున్నదెవరు ? ఆలోచించేదెవరు ? మాట్లాడేదెవరు ? అని తెలుసుకొని తీర్పు ఇవ్వాల్సిన సమయం ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఆసన్నమైంది.

ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో ఉన్న పది మందిలో అత్యంత విలక్షణమైన నేపథ్యం, పోరాట అనుభవం పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న కోరెడ్ల విజయగౌరికి వుంది. విద్యార్థి దశలో ప్రారంభమైన ఆమె




ధిక్కార స్వరం, ఉపాధ్యాయ ఉద్యమంలో మరింత రాటుదేలింది. విద్యారంగంపై ప్రభుత్వాలు ఎక్కుపెట్టిన దాడులను తిప్పికొట్టడానికి పాఠశాలలకు వెళ్లి ఉద్యమాలకు పదునుబెట్టిన పట్టుదల కలిగిన మహిళామె. తాను చదువుచెప్పిన విద్యార్థులకు కష్టమొస్తే ఆదుకొనే విశాల హృదయం ఆమెది. టిడిపి మద్దతునిస్తున్న సిట్టింగ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ తన పదవీకాలంలో ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడిందిలేదు. ప్రమాదకర విద్యావిధానాలపై నిలదీసిందీలేదు. ఆయన ఇకపై మాట్లాడుతారన్న ఆశ ఎంత మాత్రమూ లేదు. రెండు దఫాలుగా ఎన్నికైన గాదె శ్రీనువాసులు నాయుడు ఆయన కాలంలోని ప్రభుత్వానికి భజన చేయడానికి, సొంత పనులు చేసుకోవడానికి ఆ పదవిని వినియోగించుకున్నారన్న విమర్శలు ఉండనే ఉన్నాయి. రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపైనే కాదు, ప్రయివేటు ఉపాధ్యాయులకు ఆరోగ్య, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ప్రత్యేక చట్టం చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మండలిలో అడిగారు. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఏనాడూ ఈ ప్రాంత ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై మాట్లాడిన సందర్భంలేదు. 'ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, అధ్యాపకుల బాధలపై శాసన మండలిలో మాట్లాడే గొంతు ఒకటుండాలి. ఆ గొంతు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అయి ఉండాలి' అన్న వాతావరణం ఉత్తరాంధ్రలో తాజాగా కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర నుంచి తమ తరపున మాట్లాడే మనిషి మండలిలో ఒకరున్నారని ప్రతి ఉపాధ్యాయుడు, అధ్యాపకుడూ గర్వంగా చెప్పుకోవాలంటే విజయగౌరి గెలవాలి. అధికార అండతో, ప్రలోభాలతో గెలవాలనుకొనే అల్పబుద్ధులకు స్థానమివ్వబోమని ఈ ఎన్నికలతో గురువులు తేల్చిచెప్పాలి.

# బడ్జెట్‌పై వామపక్షాల నిరసన

**(మొదటి పేజీ తరువాయి..)** చేసుకున్నారని విమర్శించారు. జిఎస్‌టి, విద్యుత్ ఛార్జీల భారాలు వేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. ఈ బడ్జెట్ గొప్పగా ఉందని రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం చెప్పడం కేంద్రానికి దాసోహం అవ్వడమే అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీలు అమలుకు ఎటువంటి కేటాయింపులూ చేయని ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎలా దోహదపడుతుందని ప్రశ్నించారు. తమ అధికార ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టి మోడీ ప్రభుత్వానికి భజన చేయడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. బడ్జెట్‌లో పేదరిక నిర్మూలనకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. కార్పొరేట్ కంపెనీలు బ్యాంకులకు ఉన్న రూ.10 వేల కోట్ల అప్పులను మాఫీ చేశారని, తిరిగి బ్యాంకులు వారికి అప్పులు ఇచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకుందని దుయ్యబట్టారు. నిత్యావసర ధరలతో పాటు అన్నింటి ధరలూ పెరిగాయన్నారు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలను ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యన్నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, నాయకులు బి.ఉమామహేశ్వరరావు, జి.సుభాషిణి, సిపిఐ జిల్లా నాయకులు ఆర్.దొరబాబు, సన్యాసిరావు, శంకరరావు పాల్గొన్నారు.

## ప్రణాళికా విభాగం పనితీరుపై సమీక్ష

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎస్‌కె.విశ్వనాథన్ శనివారం ఉదయం విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో ప్రణాళికా విభాగపు పనితీరుపై జోన్ల వారీగా సమీక్ష నిర్వహించారు, న్యాయపరమైన కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మాట్లాడి గరివిడి, అడ్డూరు ప్రాంతాలలో అభివృద్ధి చేస్తున్న ఎన్‌టిఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో స్థలాలు సమీప ప్రాంతాలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేసేవిధంగా చూడాలని ఆదేశించారు.

## మిలియన్ మొక్కలు నాటడమే లక్ష్యం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఏక్ పేడ్ మాకే నామ్ పేరుతో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను విశాఖపట్నం పోర్టు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో పలుచోట్ల నిర్వహించిందని పోర్ట్ కార్యదర్శి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మిలియన్ మొక్కలను నాటడమే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నట్టు తెలిపారు. అందరూ సహకరించాలని కోరారు.

# ఉత్తరాంధ్ర కళలపై గీతం విద్యార్థుల అధ్యయనం



కళాకృతులను పరిశీలిస్తున్నగీతం విద్యార్థులు

**ప్రజాశక్తి -మధురవాడ :** ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులను ఉపయోగిస్తూ సంప్రదాయ పద్ధతిలో బొమ్మల తయారీతో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ఏటికొప్పాక కళాకారులను, ఖద్దరు తయారీలో పేరుగాంచిన పొందూరు నేతకారులను, తీరప్రాంతం వాతావరణాన్ని తట్టుకు నిలిచే గృహలనిర్మాణంలో ఆరితేరిన మత్స్యకారులను స్వయంగా కలసి వారి సంప్రదాయ కళారూపాల గొప్పదనాన్ని తెలుసుకోవడానికి వీలుగా ఉత్తరాంధ్ర అధ్యయన యాత్రను గీతం నిర్వహించింది. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ తొలి సంవత్సరం విద్యార్థులు, అసోసియేట్ ప్రొఫెసర్ రవీంద్ర పాట్నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ హేమ గుడ్ల, అతిథి అధ్యాపకులు జస్వంత్, జ్యోతి మిశ్రా మార్గదర్శకత్వంలో ఉత్తరాంధ్ర లోని పలు స్వదేశీ గ్రామాలు, శిల్ప కళలను పరిశీలించారు. బేసిక్ డిజైన్, విజువల్ ఆర్ట్స్‌లో భాగంగా నిర్వహించిన ఈ అధ్యయనం, వృత్తిపరమైన స్థలాల నిర్మాణ విధానాలను, ఆయా గ్రామాలలోని జీవన శైలి అనుగుణంగా అవి ఎలా రూపుదిద్దుకుంటాయో అర్థం చేసుకోవడమే లక్ష్యంగా సాగింది. ఈ క్రమంలో నర్సీపట్నం రోడ్డుకు సమీపంలోని ఏటికొప్పాక గ్రామాన్ని సందర్శించిన విద్యార్థులు, అక్కడి ప్రఖ్యాత చెక్కబొమ్మల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ప్రకృతి రంగులతో, సేంద్రీయ పదార్థాలతో తయారయ్యే ఈ కళాకృతులు స్థానిక శిల్పుల సంప్రదాయ జ్ఞానాన్ని పరిశీలించారు. జాజువనిపాలెం గ్రామాన్ని సందర్శించి, కుండల తయారీ ప్రక్రియను అధ్యయనం చేశారు. శ్రీకాకుళం జిల్లా బుడితి, పొందూరు గ్రామాలను పరిశీలించారు. బుడితిలో శిల్పులు లోహ శిల్పాలను రూపొందించే విధానాన్ని నేర్చుకోగా, పొందూరులో ఖాదీ నూలు వృత్తి ప్రాముఖ్యతను పరిశీలించారు. చేపలుప్పాడ, కాపులుప్పాడ సమీపంలోని కళాగ్రామాన్ని సందర్శించారు. మత్స్యకారుల జీవన విధానాన్ని పరిశీలించారు. సముద్ర తీర ప్రాంత జీవన సౌకర్యాలు, వాస్తు నిర్మాణాలను గమనించారు.

ఈ అధ్యయనం ద్వారా విద్యార్థులు స్వదేశీ సంప్రదాయాలకు దగ్గరయ్యే అవకాశం పొందారని, భవిష్యత్తులో శిల్ప సంపదను పరిరక్షించే బాధ్యతాయుతమైన వాస్తుశిల్పులుగా విద్యార్థులు ఎదగడానికి వారిలో అవగాహనను పెంచిందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సచ్చదేవ్ పేర్కొన్నారు.

## ముగిసిన శిక్షణ

**ప్రజాశక్తి -మధురవాడ :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇఇసిఇ విభాగం ఆధ్వర్యాన 'విఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ యూజింగ్ ఓపెన్ సోర్సు టూల్స్' అనే అంశంపై రెండు వారాల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) శనివారం ముగిసింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజి మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐటి గౌహతి, ఐఐటి జబల్‌పూర్, ఐఐటి రూర్కెలా, ఎన్ఐటి పాట్నాలతో కలసి గీతం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొని అధ్యాపకులు నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరణీచంద్రకుమార్ మాట్లాడుతూ, అధ్యాపకుల పరిశోధనలకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి గౌహతి ప్రొఫెసర్ త్రివేది, గీతం డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్‌ఆర్.ఫణికుమార్, డాక్టర్ చుక్కా రాజశేఖర్, ల్యాబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ ఏడాది విద్యార్థుల వీడ్కోలు వేడుక శనివారం కళాశాల ప్రాంగణంలో ఆద్యంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రిన్సిపల్‌ను అధ్యాపకులు సత్కరించారు. స్థానిక పట్టణ ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, మాజీ కౌన్సిలర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేట జెడ్‌పి హైస్కూల్‌ను డిఇఒ ఎం.ప్రేమ్‌కుమార్ శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. టెన్త్ పరీక్షల నేపథ్యంలో వారిని పరీక్షలకు సంసిద్ధులను చేయాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. టెన్త్ విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

# పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ

**ప్రజాశక్తి -గాజువాక :** పారిశుధ్యం పట్ల సచివాలయ శానిటరీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జివిఎంసి అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ ఆదేశించారు. గాజువాక జోనల్ కార్యాలయంలో శనివారం వార్డు సచివాలయ ఉద్యోగస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖపట్నం ప్రథమ స్థానం రావాలంటే పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. ప్లాస్టిక్ విక్రయాలపైనా దృష్టి పెట్టాలని, వాటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో జివిఎంసి పన్నుల చెల్లింపులు వేగవంతం చేయాలని కోరారు. బకాయిలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.శేషాద్రి, డాక్టర్ కిరణ్‌కుమార్, ఎస్-ఎస్‌వి.రామారావు పాల్గొన్నారు.

# ప్రణాళికాయుతంగా చదవాలి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** పరీక్షలంటే భయం వీడాలని, ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికా యుతంగా చదవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు సూచించారు. స్టానిక గొల్లలపాలెంలో ఉన్న కెజిబివిని శనివారం ఆయన సందర్శించారు. ఇంటర్ ద్వితీయ ఏడాది విద్యార్థినులకు జరుగుతున్న ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ పరీక్షను పరిశీలించారు. 6, 8, 10, ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. పరీక్షల నేపథ్యంలో ఆహారం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సూచించారు. విద్యార్థినులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు.

# ఆలయాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ఆరిలోవ అన్నానగర్‌లో షిరిడి సాయిబాబా, రామాలయం, విఘ్నేశ్వర సహిత శివాలయం, నల్ల మారెమ్మ అమ్మవారి ఆలయాల పునర్నిర్మాణ పనులకు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్నానగర్ గ్రామ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన గ్రామ ప్రజల సహకారంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నానగర్ గ్రామ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించాలి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రకృతి ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ ఎం.అంజిబాబు విద్యార్థులకు సూచించారు. స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ప్రకృతి స్కూల్ వార్షిక క్రీడా ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపేలా ఆద్యంతం ఉత్సాహంగా క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

## దళితులపై దాడులు హేయం

**ప్రజాశక్తి -తగరపువలస :** పలు రాష్ట్రాల్లో ఇటీవల దళితులపై దాడులకు నిరసనగా శనివారం భీమిలి మండలం, తాళ్లవలస ఎస్సీ కాలనీలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు నిరసన తెలిపారు. మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ, దేశంలో దళితులను 75 ఏళ్ల వెనక్కి నెట్టేలా పాలకుల విధానాలు ఉన్నాయని విమర్శించారు. మతోన్మాదులు దళితులపై వివిధ రూపాల్లో దాడులు చేస్తుంటే కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోని సన్నిబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అధ్యక్షులు మామిడి శివ, కె.వీరకుమార్, ఎస్.రాంబాబు, బోని శివ తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మణరావు

## రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

### భార్యకు గాయాలు

**ప్రజాశక్తి-ఆనందపురం :** మండలంలోని గిడిజాల వైఎస్ఆర్ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామానికి చెందిన బంటుపల్లి లక్ష్మణరావు (36) భార్య గౌరీవరలక్ష్మి వేమగొట్టిపాలెంలో మృతిచెందిన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆనందపురం వస్తుండగా విజయనగరం నుంచి సింహాచలం వైపు వస్తున్న కారు గిడిజాల వైఎస్ఆర్.కాలనీ సమీపంలో వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. లక్ష్మణరావు కారు అద్దంపైకి తుళ్లి పడిపోయారు. భార్య గౌరీవరలక్ష్మి రోడ్డుపై పడడంతో ఆమె రెండు కాళ్లపై నుంచి కారు చక్రాలు వెళ్లిపోయాయి. ఆమెకు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. వారిద్దరినీ విశాఖపట్నం పినాకిల్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో లక్ష్మణరావు మృతిచెందారు. గౌరీ వరలక్ష్మి తీవ్ర గాయాలతో విషమ పరిస్థితిలో ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. డ్రైవర్ మద్యం తాగి, అతివేగంగా కారును నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధి కూలీ మృతి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** మండలంలోని టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఉపాధి కూలి గువ్వల నారాయణమ్మ (64) శనివారం చెరువులో మట్టి పనులు చేస్తూ అకస్మాత్తుగా కుప్పకూలింది. వాంతులు చేసుకుని ఒక్క సారిగా కుప్పకూలడంతో తోటి కూలీల సాయంతో ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్ పల్లా మురళి తగరపువలసలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఫీల్డ్ అసిస్టెంట్ మురళి తెలిపారు. దాకమర్రి పంచాయతీ ముద్దాడపేటలోని బాపన చెరువులో జరుగుతున్న మట్టి పనుల్లో నారాయణమ్మ పనిచేసినట్లు ఎంఎన్ఆర్ఇజిఎస్ మండల ఇన్‌ఛార్జి అడిషనల్ ప్రోగ్రాం అధికారి గౌరి తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎండిఒ ఎన్.హనుమంతరావు పరిశీలించారు.

మృతి చెందిన నారాయణమ్మ కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలని సిఐటియు జోన్ నాయకులు రవ్వ నరసింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కాలువలో బాలుని మృతదేహం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** కంచరపాలెం దరి రామ్మూర్తి పంతులు పేట జివిఎంసి హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న బెంగాలీ తరుణ్ (9) జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు ఆనుకొని ఉన్న కెనాల్‌లో శనివారం విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందడంతో కంచరపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో తేలియాడుతున్న బాలుని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ విషయమై కంచరపాలెం పోలీసులు మీడియాతో మాట్లాడుతూ తరుణ్ శుక్రవారం స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లి అప్పటి నుంచి ఇంటికి రాలేదని తల్లి పల్లవి తమకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. బాలుని మృతిపై దర్యాప్తు జరుపుతామని చెప్పారు.

## వైసిపి నాయకునికి పరామర్శ

**ప్రజాశక్తి -పద్మనాభం:** మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన రాజా సాగి సన్యాసిరాజు (దేముడు బాబు) ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి చిన్న శ్రీను శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి ఎస్.గిరిబాబు, నాయకులు కె.లక్ష్మణరావు, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఒయు పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

## సాంకేతిక సహకారానికి ఎంఒయు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ అమలు చేస్తున్న పథకాలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని తీసుకొనేందుకు స్వానిటీ ఇనీషియేటివ్‌తో ఒప్పందం కుదుర్చుకొంది. సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి సమక్షంలో సంస్థ ఎనర్జీ కన్సర్వేషన్ విభాగం సిజిఎం జె.శ్రీనివాసరావు సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ట్రస్టీ ఉమ బట్టాచార్య ఎంఒయుపై సంతకాలు చేశారు. ఎపిఇపిడిసిఎల్‌లో అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్, ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూటెడ్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందించేందుకు అమెరికాకు చెందిన స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ ఓపెన్ యాక్సెస్ విధానం వల్ల ఇపిడిసిఎల్ ఆదాయంపై కలిగే ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేయడం, సంస్థ ఆర్థిక నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడమే కాకుండా విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించనుంది.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన శనివారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు రైల్వే న్యూ కాలనీలోని ఈస్ట్ కోస్ట్ రైల్వే స్కౌట్ కేంపింగ్ సెంటర్‌లో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, ఈస్ట్ కోస్ట్ రైల్వే స్కౌట్స్ సంస్థ కార్యదర్శి కెఆర్.జగన్నాథం, సంస్థ వైస్ ప్రెసిడెంట్ నరవ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్‌కుమార్ పాల్గొన్న కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ వ్యవస్థాపకులు బెడెన్ పవల్, లేడీ బెడెన్ పవల్ చిత్రపటానికి పూల మాల వేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగాలు, ఇతర రంగాల్లో ప్రభుత్వం రిజర్వేషన్ల శాతం పెంచగలిగితే ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన నాలుగు వందలమంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం ప్రతినిధి కె.ఎల్లయ్య, జిల్లా కమిషనర్లు ఎన్‌వి.రమణ, ఆర్.మధుసూధనరావు, కె.పద్మ, జివై.నాయుడు, అసిస్టెంట్ సెక్రటరీ జి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

**బుల్లయ్య కళాశాలలో...**

లంకపల్లి బుల్లయ్య కళాశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ ఆధ్వర్యాన వరల్డ్ థింకింగ్ డేను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టాస్క్ ఫోర్స్ సిఐ బంగారుపాప హాజరై మాట్లాడుతూ, నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధు కుమార్, డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, డి.దీపక్‌చౌదరి, టి.బ్రహ్మానందరెడ్డి, బిఆర్ఎస్ లక్ష్మణ్‌రెడ్డి, గంగాభవాని, స్వాతికృష్ణయాదవ్, సూర్య ఎల్లమాంబేశ్వరి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల గొంతు విజయగౌరి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



మాట్లాడుతున్న ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి- యంత్రాంగం

**చింతపల్లి:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే విజయగౌరి గెలిపించాలన్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో జీవో 3 రద్దు కావడంతో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లేక వలస పోతున్నారన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గెలుపొందితే చట్టసభల్లో జీవో 3 పునరుద్దరణకు కృషి చేస్తారన్నారు. గిరిజన ప్రాంతంలోని ఖనిజ సంపదను కాపాడుకునేందుకు చట్టసభల్లో పోరాటం చేస్తామన్నారు. 1/70 చట్టం పరిరక్షణ కోసం గిరిజనులకు నిరంతరం అండగా ఉంటారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రద్దు చేసిన ప్రభుత్వ పాఠశాలలతో విద్యార్థులు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి విద్యను అభ్యసించవలసిన దుస్థితి నెలకొందన్నారు. గిరిజన భూములకు రక్షణ లేకుండా చూడడమే కాకుండా, రహదారులకు ఇరువైపులా సుమారు 5 కిలోమీటర్ల మేర భూములను ఆక్రమంగా లాక్కుంటున్నారన్నారు. గిరిజన చట్టాలను సవరించే అధికారం ఈ ప్రభుత్వాలకు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. భూ బదలింపు చట్టాన్ని సవరిస్తే మన్య ప్రాంతంలో మరో అల్లూరి సీతారామరాజు పోరాటం చేపడ తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె త్రిమూర్తులు రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, కృష్ణ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గాజువాక :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ గాజువాకలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదిత్య, చైతన్య, ఎవికె, చైతన్య కాలేజీలు, వివిధ పాఠశాలల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ఎమ్మెల్సీ గేయానంద్, వివిధ సంఘాల నాయకులు రాంబాబు, శ్రీనివాస్, పరుశు రాం పాల్గొన్నారు.



చైతన్య కాలేజీలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అజశర్మ

# సమస్యలపై తపాలా ఉద్యోగుల ర్యాలీ




ర్యాలీ చేస్తున్న తపాలా ఉద్యోగులు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యాన శనివారం రైల్వే స్టేషన్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిజెసిఎ చైర్మన్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, పోస్ట్ ఆఫీస్ చట్టం -2023ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఎఐఎఫిఇయు, ఎన్ఇపిఇ సంఘాల గుర్తింపు రద్దు ఉత్తర్వులపై జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను తక్షణమే అమలు చేయాలని, ఎన్‌పిఎస్‌యుపిఎస్ కాకుండా అందరికీ ఓపిఎస్ ఇవ్వాలని, కలిపివేసిన ఎల్‌బి2 మెయిల్ ఆఫీసులను తిరిగి ప్రారంభించాలని, ఎల్2 ఆఫీసులో ఐసిహెచ్ పిహెచ్‌లను మరల ప్రవేశ పెట్టాలని, కరోనాకాలంలో మూసివేసిన ఆర్ఎంఎస్ ట్రాన్సిట్ సెక్షన్లను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఆర్‌టియును రద్దుచేసి డిపార్ట్‌మెంట్‌లో ఎంఎంఎస్‌ను ప్రారంభించాలని, జిడిఎస్‌లకు సివిల్ సర్వెంట్స్ హోదా ఇవ్వాలని, జిడిఎస్‌లను కూడా ఎనిమిదవ వేతన కమిటీలో చేర్చాలని, వారికి ఫ్యామిలీ పెన్షన్, మెడికల్, సర్వీస్ బెనిఫిట్ సౌకర్యాలను కల్పించాలని, సీనియర్ అకౌంట్స్ వారికి 40 పర్సంటేజ్ ఎస్ఎఫ్ కోటా కింద ప్రమోషన్ ఇవ్వాలని, అన్ని కేడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. ఎలక్ట్రికల్ వింగ్ స్టాఫ్‌ను ప్రత్యేకంగా భర్తీ చేయాలని, కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా రివ్యూ చేయడం ఆపాలని, తపాలా ఉద్యోగులకు అన్ని విధాలుగా భద్రత కల్పించాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పిజెసిఎ కన్వీనర్ ఎస్.దాసు, ఉద్యోగుల భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## క్యాంపస్ డ్రైవ్‌లో 25 మంది ఎంపిక

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ద్వారకానగర్‌లోని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ ద్వారా 25 మంది విద్యార్థులు ఎంపికైనట్లు సంస్థ సెంట్రల్ మేనేజర్ వరదా రవికుమార్ చెప్పారు. అప్లికేషన్ డెవలప్‌మెంట్ అండ్ డిప్లాయిమెంట్ టెక్నాలజీలో యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్, విశాఖపట్నంతో దేవ్‌ప్లాస్ ఇంజినీర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ సిస్టమ్ ఇంజనీర్ వంటి బహుళ ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. సి, పైథాన్, ఎడబ్ల్యుఎస్, డివోప్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, సిసిఎన్ఎ, సిసిఎన్‌పి, హార్డ్‌వేర్ నాలెడ్జ్‌లో మంచి నైపుణ్యం కలిగిన సుమారు 275 మంది బిటెక్ ఫ్రెషర్లు/గ్రాడ్యుయేట్లు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనగా 25 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి క్యాంపస్ డ్రైవ్ మార్చి నెల తొలి వారంలో నిర్వహించనున్నట్లు హెచ్ఆర్ మేనేజర్ దివ్యజ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సీ ప్రిన్సిల్లా హరీష్ కుమార్, వత్సల్య సాయి, సాగర్ పాల్గొన్నారు.

# విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి -యంత్రాంగం

**కేథరిన్‌లో...**

**తగరపువలస :** స్థానిక మూలకుద్దు కేథరిన్ పాఠశాల 41వ వార్షికోత్సవం సందర్భంగా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుచేశారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న మేధో సంపత్తి, ప్రతిభా పాటవాలను, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడినట్లు పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయ పడ్డారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. తొలుత వార్షికోత్సవ వేడుకలను జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో కేథరిన్ పాఠశాల వ్యవస్థాపకులు ఆచార్య ఆర్‌డి.రత్నరాజ్, కరస్పాండెంట్ ఆలివర్‌రాయి, డైరెక్టర్ డాక్టర్ ఇవాంజలిన్ రాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేథరిన్‌లో నమూనాలను తిలకిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

**శ్రీ విజ్ఞాన్ బ్రిలియంట్‌లో..**

**గాజువాక :** జివిఎంసి 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని శ్రీ విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. శ్రీదేవి విజ్ఞాన్ జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ కప్పిలి కీర్తి పట్నాయక్ ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు నమూనాలను తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్స్ దోహదపడుతుందన్నారు. విద్యార్థులు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా తమలో ఉన్న ఆలోచనలను ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చూపాలని సూచించారు. వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

పాఠశాల కరస్పాండెంట్ కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ, ఒకటో తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు 154 సైన్సు ప్రదర్శనలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ కె.పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నెల్లి శ్రీనివాసరావు, సాయిని సన్యాసిరావు, విందుల వరహాలు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె. పరశురాం, ఉపాధ్యాయులు జి.రవితేజ, శ్రీరాములు, రాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీ విజ్ఞాన్ బ్రిలియంట్‌లో..

# టమాటా సాగు పరిశీలన

**- ప్రజాశక్తి కథనానికి స్పందించిన హార్టికల్చర్ అధికారులు**
**- రైతుల నుంచి టమాటాలు మార్కెట్‌కు తరలింపు**

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

టమాటా ధరల పతనంపై 'ధర వెలవెల-రైతుల విలవిల' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి హార్టికల్చర్ అధికారులు స్పందించారు. టమాటా ధర పూర్తిగా తగ్గిపోవడంతో గిట్టుబాటు ధర రాక రైతులు టమాటా పంటను పొలాల్లోనే విడిచిపెడుతున్న వైనాన్ని ప్రజాశక్తి తెలియజేసింది. దీంతో బుచ్చయ్యపేట ఇన్‌ఛార్జి హార్టికల్చర్ అధికారి భాను పుష్ప లీలావతి, వ్యవసాయ శాఖ సహాయకులు జి.గణేష్, చోడవరం మార్కెట్ కమిటీ సెక్రటరీ ఎస్.బంగార్రాజు తదితరులు శనివారం నేతవానిపాలెంలోని రైతు మడగల అవతారం పొలాన్ని పరిశీలించారు. పొలంలో టమాటాలను సేకరించకుండా విడిచిపెట్టడంపై రైతుల నుండి వివరాలు సేకరించారు. మార్కెట్లో ధర లేకపోవడంతో పంటను పొలాల్లోనే విడిచిపెడుతున్నామని తెలిపారు. రైతు నుండి టమాటాలను సేకరించి మార్కెట్కు తరలిస్తున్నట్లు అధికారులు చెప్పారు. మండలంలోని రాజాం గ్రామంలో కూడా పలువురు రైతులు వేసిన టమోటా పంటలు పరిశీలించి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.



నేతవానిపాలెంలో టమోటా పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ శాఖ అధికారులు



టమాటా రైతులతో మాట్లాడుతున్న ఆప్ నేత హరినాథ్‌బాబు

## మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి కూరగాయల మార్కెట్లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మార్కెట్‌లో టమాటా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 35 కేజీల టమాటాలు రూ.180 ధర ఇస్తున్నారని రైతులు కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా హరినాథబాబు మాట్లాడుతూ అనకాపల్లిలో రైతు పండించిన పంట దాచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ లేకపోవడం, రైతు బజార్ లేకపోవడంతో రైతులు కష్టపడి పండించినా గిట్టుబాటు ధర రావడం లేదని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో రైతులను ఆదుకుంటామని, రైతు బజార్, కోల్డ్ స్టోరేజ్ కడతామని ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ పండించిన టమాటాలను ఐదారు కిలోమీటర్ల దూరం నుండి అనకాపల్లి కూరగాయలు మార్కెట్‌కు తీసుకొస్తే, ధర లేకపోవడంతో ఆటో ఛార్జీలు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటమి ప్రభుత్వం, నాయకులు రైతుల బాధను అర్థం చేసుకొని అనకాపల్లిలో రైతు బజారును ఏర్పాటు చేయాలని, రైతు పండించిన పంట దాచుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మాజీ మంత్రి కన్నబాబును కలిసిన బొడ్డేడ

ప్రజాశక్తి-మునగపాక

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబును వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి శనివారం కన్నబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కన్నబాబుకు గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎలమంచిలి ఎంపీపీ బొద్దపు గోవిందు, నాయకులు కాండ్రేగుల నూకరాజు, దాసరి అప్పారావు, మల్ల సంజీవరావు, బీసెట్టి గంగ అప్పలనాయుడు, సరగడం జగన్నాథరావు, మద్దాల వీరు నాయుడు, కాండ్రేగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.




కన్నబాబును గజమాలతో సత్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్ తదితరులు

# కర్రి పార్వతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

సిపిఎం సీనియర్ నాయకులు, మహిళా ఉద్యమ నేత కామ్రేడ్ కర్రి పార్వతమ్మకు అచ్యుతాపురంలో శనివారం సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పార్వతమ్మ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, కె.రామ సదాశివరావు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం శాఖ కార్యదర్శి కె.సోమునాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ పార్వతమ్మ చేసిన సమాజ సేవ, పోరాటాలను గుర్తు చేశారు. ప్రధానంగా మద్యపాన నిషేధం పోరాటంలో ఈ ప్రాంతంలో ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. విద్య, ఆటలు తదితర వాటిని ఆమె ప్రోత్సహించేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సరగడం రామునాయుడు, ఆర్.లక్ష్మి, చేపల తాతయ్య, సత్తిబాబు, నాయుడు, కదారి కాసులమ్మ, త్రిమూర్తులమ్మ తదితరులు పాల్గొన్నారు.



పార్వతమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

## పేదలపై న్యాయమూర్తి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరపల్లి : సబ్సిడీలు, సంక్షేమ పథకాల వల్ల పేదలు, వ్యవసాయ కార్మికులు సోమరిపోతులుగా మారుతున్నారని సుప్రీం కోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి ఇటువంటి వ్యాఖ్యలు రావడం దారుణమన్నారు. రాజ్యాంగ లక్ష్యానికి, నిబద్ధతకు అనుగుణంగా ఈ వ్యాఖ్యలు లేవన్నారు. ప్రభుత్వాలు పేదలకు అమలు చేస్తున్నది ఉచిత పథకాలు కాదని.., అవి ఉత్పత్తి పథకాలని, ఇవి ఉంటేనే దేశంలో ఉత్పత్తి జరుగుతుందని స్పష్టం చేశారు. రూ.6వేలు జీతంతో పేదలు బతుకుతున్నారంటే ఈ పథకాలే కారణమని, ఇవే లేకపోతే వ్యవస్థలో ఎప్పుడో తిరుగుబాటు వచ్చేదని పేర్కొన్నారు. శ్రమజీవులను అవమానించే వారికి ఆ కుర్చీలో కూర్చొనే కనీస అర్హత లేదన్నారు. దేశంలో సోమరిపోతులంటే కార్పొరేట్లేనని, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు రూ.46,796 కోట్లు రుణం ఇస్తే తిరిగి చెల్లించింది కేవలం రూ.456 కోట్లు మాత్రమేనని, మిగిలిన మొత్తం ప్రభుత్వం మాఫీ చేసిందని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన న్యాయమూర్తులే ఈ విధంగా మాట్లాడితే రాజ్యాంగానికి రక్షణ ఎక్కడుంటుందని ప్రశ్నించారు. న్యాయమూర్తులు పేదరిక నిర్మాణ కోసం పాలకులపై ఒత్తిడి చేస్తే బాగుంటుందని హితవుపలికారు.

# 'అయ్యన్న'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-కె.కోటపాడు

అందుబాటు ఫీజులో ఉత్తమ విద్యను అందిస్తున్న అయ్యన్న విద్యాసంస్థలను ప్రోత్సహించాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం కిండర్ గార్డెన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సెర్మనీ, 10, ఇంటర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులకు ఫేర్ వెల్ డే కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆచార్య ముత్యాలనాయుడు, అయ్యన్న ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు అయ్యన్న సాహెబ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో జరిగిన 'గ్రాడ్యుయేషన్ డే'లో 50 మంది యుకెజి విద్యార్థులకు ముత్యాలనాయుడు, 'అపుస్మా' జోన్-1 అధ్యక్షుడు ఎంవి.రావు, డాక్టర్ ఖాశీం పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ పిల్లలకు మధ్యాహ్నం భోజన సౌకర్యం క్యాంపస్ ఏర్పాటు చేస్తానని డాక్టర్ ఖాశీం ప్రకటించడం హర్షణీయమన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ కాలేజీల ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కిండర్ గార్డెన్, స్కూల్, కాలేజీల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, విశ్రాంత అధ్యాపకుడు పూడి సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు దొగ్గ రామకృష్ణ, తెలుగు ఉపాధ్యాయుడు బివి.రమణమూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





గోల్డ్ మెడల్స్ చూపుతున్న క్రీడాకారులు

## ఖేలో ఇండియా ఉమెన్ ఉషు పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉమెన్ ఉషు పోటీల్లో చోడవరం గణేష్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 20, 21 తేదీల్లో రాజమండ్రిలో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉమెన్ ఉషు లీగ్ (చైనీస్ మార్షల్ ఆర్ట్స్) పోటీల్లో గణేష్ డిఫెన్స్ అకాడమీకి చెందిన అన్నపూర్ణ 48 కేజీల విభాగంలోనూ, లావణ్య 60 కేజీల విభాగంలోనూ, సాయిలక్ష్మి 65 కేజీల విభాగంలోనూ బంగారు పతకాలు సాధించారు. వీరు సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ ఉషు అసోసియేషన్ ఫౌండర్ మోహన ముత్యాలరావు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉషు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నరసింహారావు, ప్రెసిడెంట్ ఆదిశేషులు, విశాఖపట్నం కోచ్ వెంకటేష్, రమ్య తదితరులు అభినందించారు. చోడవరం ప్రాంత గ్రామీణ యువతను క్రీడాకారులుగా, సైనికులుగా మల్చుతున్న గణేష్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ పుల్లేటి గణేష్ సేవలను పలువురు కొనియాడారు.

## 13న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కే ఏ డి కెవిడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మార్చి 13న నిర్వహిస్తున్నామని ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వడ్డాది హైస్కూల్లో 1953 నుండి 2024 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ తరపున సంఘ రిజిస్ట్రేషన్లు, స్కూల్ అభివృద్ధి, పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన వారిని గుర్తించడం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి రమణ, ఎస్ భాస్కర్‌రావు, ఎస్ వరహాలబాబు, లక్ష్మీనారాయణ, పివి శేషుబాబు, సయ్యపురెడ్డి సత్యనారాయణ, కోవెల జనార్దన్, పినపాత్రుని సాంబశివరావు, కోవెల పోలీశ్వేరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి నగదు, బియ్యం వితరణ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని గొబ్బూరు గ్రామానికి చెందిన బుల్లి వెంకటరమణ, రమణమ్మ దంపతులు 14వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.5116 నగదు, బియ్యం బస్తా విరాళం శనివారం అందజేశారు. వారికి ఆలయ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## హెరిటేజ్ పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరంలో ఏర్పాటు చేసిన హెరిటేజ్ డెయిరీ పాల శీతలీకరణ కేంద్రాన్ని జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు శనివారం ప్రారంభించారు. రీజనల్ మేనేజర్ పి.తులసి నాయుడు, బయ్యవరం ప్లాంట్ ఆపరేషన్ జనరల్ మేనేజర్ ఎన్. వంశీ మాట్లాడుతూ కసింకోట, అనకాపల్లి, మాకవరపాలెం, ఎలమంచిలి మండలాల పాడి రైతుల దగ్గర నుంచి సేకరించిన పాలుకు జిల్లాలో అన్ని డెయిరీల కంటే ఎక్కువ రేటు పాడి రైతులకు చెల్లిస్తుందని తెలిపారు. హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న ప్రతి గ్రామంలో పశువులకు కృత్రిమ గర్భధారణ అందుబాటు ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ ప్రతినిధులు కె.సంతోష్ కుమార్, కె.సుధాకర్‌నాయుడు, మేనేజర్ కూండ్రపు శేషు, ఆర్‌వై నాయుడు, ఎం. రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హెరిటేజ్ అధికారులు

# చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగించాలి

## అంగన్వాడీ టీచర్ల శిక్షణలో జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి పట్నాయక్



శిక్షణా పద్ధతులను పరిశీలిస్తున్న డిఇఒ అప్పారావు నాయుడు

ప్రజాశక్తి-కె.కోటపాడు

చిన్నారులకు విద్య పట్ల ఆసక్తి కలిగేలే అంగన్వాడీ టీచర్లు కృషి చేయాలని జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఎంఎం పట్నాయక్ అన్నారు. మండల కేంద్రం కె.కోటపాడులో అంగన్వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతి ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో గుణాత్మక విద్యను అందించేందుకు పాటుపడాలన్నారు. అంగన్వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు బోధనోపకరణాల ద్వారా ఆసక్తి కలిగించాలని సూచించారు. అనంతరం జ్ఞానజ్యోతి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1, 2 కె.సత్యనారాయణ, డివిడి ప్రసాద్, సిడిపిఒ మంగతాయారు, సూపర్వైజర్లు సుశీల, రాములమ్మ, రిసోర్స్ పర్సన్ అశోక్ కుమార్, ఉమామహేశ్వరరావు, త్రినాధరావు పాల్గొన్నారు.

**చోడవరం :** స్థానిక బాలికోన్నత పాఠశాల కేంద్రంగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న నూతన అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని, వినూత్న బోధన చేయాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా అంగన్వాడీ కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కేంద్రంలో తయారు చేసిన బోధనోపకరణాలను పరిశీలించి రిసోర్స్ పర్సన్స్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి సింహాచలం, ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, రిసోర్స్ పర్సన్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**వడ్డాది :** పిల్లల్లో సృజనాత్మక నైపుణ్యాన్ని పెంపొందించడానికి అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారులు బొంజిబాబు, కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్లో నాలుగో రోజు జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆటలు పాటలు వంటి కార్యక్రమాల ద్వారా చదువు పట్ల ఆసక్తి కల్గించాలని కోరారు. పిల్లల్లో ఉన్న విభిన్న అభిప్రాయాల్లో ఆలోచనలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీవీ శేషుబాబు, టివి శేషగిరిరావు, తాటికొండ శ్రీను, కుమార్, గొలుగొండ శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**నక్కపల్లి :** మండలంలో అంగన్వాడీ టీచర్లకు రెండు విడతలుగా ఆరు రోజులు చేపట్టిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వేమగిరి నూకరాజు అన్నారు. నాలుగవరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి హైస్కూల్లో జరుగుతున్న తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రాథమిక విద్యా విధానంలో చేపడుతున్న సంస్కరణలు, గుణాత్మకమైన విద్యను అందించడానికి ఈ శిక్షణ తరగతుల్లో చర్చించి అవగాహన కల్పించుకోవాలన్నారు. సూపర్ వైజర్ కె.లలిత, సత్యవతిలు మాట్లాడుతూ, రాబోయే 3 సంవత్సరాల కాలంలో 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుల్లపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ తరగతులకు రిసోర్స్ పర్సన్లుగా సి.హెచ్. ప్రసాద్, జయరాజు, గణేష్లు వ్యవహరించి అంగన్వాడీ టీచర్లకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు.



వినూత్న పద్ధతిలో శిక్షణ ఇస్తున్న దృశ్యం



ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## కేన్సర్‌పై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-వడ్డాది

ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ఉపాధి హామీ పనులను శనివారం ఆమె పరిశీలించి, కొత్త రిజిస్ట్రేషన్లు చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడుతూ మానవ శరీరంలో అనేక రకాల క్యాన్సర్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తడి పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలని, ఇంట్లో వీధిలో తడి పొడి చెత్తను వేరువేరుగా చేసి సంపద కేంద్రానికి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రామకృష్ణారావు, పంచాయతీ ఈఓ లావరాజు, విఆర్‌వో గోవింద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్

చోడవరం స్వయంభు గౌరీశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 24న ప్రారంభమయ్యే శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు శనివారం విడుదల చేశారు. వారం రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలు మార్చి 1వ తేదీన ముగుస్తాయి. ఈ సందర్భంగా వారం రోజులు పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి గూనూరు సురేష్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు చలపతిరావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు దేవరపల్లి వెంకట అప్పారావు, ఎలక మల్లిబాబు, వర్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సురేష్ మరణం తీరని లోటు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్ఎంపి వైద్యులు పాటోజు సురేష్ మరణం తీరని లోటని అనకాపల్లి ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చాగంటి సర్వారావు అన్నారు. అనకాపల్లి పట్టణంలో ఆర్ఎంపీ వైద్యునిగా, ల్యాబ్ టెక్నీషియన్‌గా చిరపరిచితులైన సురేష్ ఈ నెల 12న అనారోగ్యంతో అకాల మరణం చెందారు. శనివారం సురేష్ దశదిన కర్మ కావటంతో సీనియర్ పాత్రికేయులు సర్వారావు, ఇతర స్నేహితులందరూ కలిసి స్థానిక లోకావారి వీధిలోని సురేష్ నివాసానికి చేరుకుని స్నేహితుని చిత్ర పటానికి పూల మాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌తో తమకున్న అనుబంధాన్ని నెమరు వేసుకుని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. భవిష్యత్తులో తామంతా అండదండగా ఉంటామని సురేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శిం చిన వారిలో సీనియర్ పాత్రికేయులు శివ, సూరిశెట్టి శివాజీ, రామకృష్ణ, ఎ.రామకృష్ణ, ఎల్.రామకృష్ణ, ఎ.నూకరాజు తదితరులు వున్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిలో సుమారు 13 సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో సిఆర్ఎంటిఎస్, ఎంఐఎస్, ఐఆర్టి, డిటిఓ అకౌంటెంట్, పిటిఐ మెసెంజర్లుగా పని చేస్తున్న వారికి డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలని బాధిత అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎటువంటి జీతాలు పెరుగుదల లేక ఏంటిఎస్‌గాని, హెచ్‌ఆర్ పాలసీ అమలు కాక అరకొర వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులుగా ఎస్జిటి పోస్టులకు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు తాము అన్నీ అర్హతలు కలిగి ఉన్నామని, కాబట్టి 2024 మెగా డిఎస్‌సిలో తమ సర్వీస్‌లో భాగంగా 10 మార్కులు వెయిటేజ్ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపేట మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల అధ్యక్షులు తాటికొండ శ్రీను, ఆర్‌పి కుమార్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# గ్యాస్ స్టవ్ పేలి మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

గ్యాస్ స్టవ్ పేలిన ప్రమాదంలో మినీ అంగన్వాడీ కేంద్రం నిర్వాహకరాలుకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం ఉదయం మండలంలోని గవరపాలెం శివారు భూమిరెడ్డి కొంపలులో చోటుచేసుకుంది. భూమిరెడ్డి కొంపలు గ్రామానికి చెందిన మినీ అంగన్వాడీ కేంద్రం నిర్వాహకురాలు కర్రి ఉమాపార్వతి గ్యాస్ స్టవ్ వెలిగించి వంట చేస్తుండగా గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. తలుపు రెక్కలు విరిగి పడిపోయాయి. ప్రమాదం జరిగి మంటలు చెలరేగడంతో ఉమా పార్వతి తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఆమెను కె.కోటపాడు ప్రభుత్వ 50 పడకల ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ మేరకు కె కోటపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఉమా పార్వతిని ఆదుకోవాలి : సిపిఎం**



గాయపడిన ఉమా పార్వతిని పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

గ్యాస్ స్టవ్ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఉమా పార్వతిని సిపిఎం నాయకులు ఆస్పత్రిలో పరామర్శించారు. ఉమాపార్వతికి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆమె కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు గండి నాయనబాబు, యర్ర దేముడు, వనుము సూర్యనారాయణ ఉన్నారు.

## మానసిక ఒత్తిడిని జయించాలి




మాట్లాడుతున్న సైకాలజిస్టు సంజన

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడిని జయించేందుకు ప్రయత్నించాలని ప్రముఖ సైకాలజిస్ట్ ఎ.సంజన అన్నారు. స్థానిక ఏఎంఎఎల్ కళాశాలలో శనివారం విద్యార్థుల మానసిక ఒత్తిడిపై ఆమె గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చిన్న చిన్న విషయాలకు విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ఫేస్బుక్, వాట్సాప్ ద్వారా పరిచయాలను పెంచుకొని తర్వాత మోసపోయి అనేక రకాలైన ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తెలియని నెంబర్ నుంచి వచ్చే కాల్స్‌ని రిసీవ్ చేసుకోవడం ద్వారా మన విలువైన సమాచారాన్ని పక్కవారితో పంచుకున్నట్లు అవుతుందని, దీనివలన బ్యాంకు లావాదేవీలలో అనేక రకాల నష్టాలకు గురవుతున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయం పట్ల మంచి అవగాహన పెంచుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు ఒత్తిళ్లకు లోనుకాకుండా ఉండాలని సూచించారు. కళాశాల సూపరింటెండెంట్ పి.అనురాధ మాట్లాడుతూ ముఖ్యంగా ఆడపిల్లలు ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్‌కు, వాటి ద్వారా వచ్చే పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, మహిళా సాధికారిత కో ఆర్డినేటర్ జె.సామ్రాజ్యం, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.సూరిబాబు, బిఎంవిపి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గౌరీపరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-కశింకోట

మండల కేంద్రం కశింకోట వెలమపేట శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, సిదిరెడ్డి శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వీరాంజనేయ స్వామి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం శివారు గ్రామంలో శ్రీవీరాంజనేయ స్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు, వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ముత్యాలనాయుడును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు యడ్ల నాయుడు, ఐడి.బాబు, గండి ముత్యాలనాయుడు, సురేష్, కన్నంనాయుడు, మోహన్, దేముడునాయుడు, రమేష్, నవీన్, చెల్లంనాయుడు, అనంత్, వసంత్, సాయి కుమార్, కరక రాము, గురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## త్వరలో దత్తత గ్రామాల్లో సర్వే

ప్రజాశక్తి-కశింకోట

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కశింకోట రాజీవ్‌గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాల మండలంలోని బయ్యవరం, జమాదులపాలెం, తేగాడ, పిసినికాడ, కశింకోట గ్రామాలను దత్తత తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భీమిశెట్టి ఉమాశంకర్ తెలిపారు. త్వరలో దత్తత గ్రామాలలో సర్వే నిర్వహించి, ఏయే అంశాలలో అభివృద్ధి చేయాలో పరిశీలించి, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రీజినల్ కోఆర్డినేటర్ బి.పావని కళాశాలను సందర్శించి ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దత్తత గ్రామాలు బయ్యవరం, పిసినికాడ గ్రామాల్లో సచివలయాలను సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రిన్సిపల్ కె.శివ, విభాగాధిపతులు రమణ కుమార్, గణేష్, ఆఫీసు సూపరింటెండెంట్ కె శివరామ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

## ఫలించిన సిపిఎం పోరాటం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు నేరెళ్ల బంద గ్రామ ఆదివాసీ గిరిజనులు చేసిన పోరాటం ఫలించింది. శనివారం జెడ్.జోగం పేట నుంచి నేరెళ్ల బంద రహదారి పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు.

గత కొన్నేళ్ళ గా సిపిఎం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల నిరసన కార్యక్రమాలు నిర్వహించడం తో అధికారులలో స్పందన వచ్చింది. వారంరోజుల్లో అటవీ శాఖ అనుమతులు కల్పించి సుమారు రూ 2 కోట్ల 50 లక్షల డిపిసి, ఎంజిఎన్ ఆర్ఈజి ఎస్ (ఉపాధి హామీ పథకం) నిధులతో ఆ గ్రామానికి రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

జిల్లాలో నాన్ షెడ్యూల్ ఏరియాలో చీమలపాడు పంచాయతీ శివారు కొండ పై పీవీటిజీ కొందు గిరిజనులు సుమారు 13 కుటుంబాలలో 80 జనాభా నివసిస్తుంది. కనీసం ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటు హక్కు, మంచినీరు, కరెంటు సౌకర్యాలు లేవు. ఆరోగ్యం క్షీణించినా డోలి మోతలు తప్పలేదు.

గత జనవరి నెలలో జరిగిన ఇటుకుల పండగకు చింతపల్లి మండలం నుంచి అత్త గారి ఇంటికి వచ్చిన యువ అల్లుడు కొర్ర సుబ్బారావు కాలి నడకన వెళ్తూ స్పృహ తప్పి పడిపోయాడు. దీనిపై పలు పత్రికల్లో వార్త లు రావడంతో స్పందించిన చోడవరం జడ్జ్ గౌరీ శంకర్ గ్రామాన్ని సందర్శించారు. అక్కడి సమస్య లపై నివేదిక తయారు చేసి ప్రభుత్వాని కి పంపారు...

ఈ సమస్య పై 2018లో సిపిఎం ప్రతినిధి బృందం నేరేళ్ళ బంధ గ్రామాన్ని పరిశీలన చేసి పై సమస్యలు గుర్తించారు. అధికారు ల దృష్టిలో పెట్టారు. అప్పటి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 2019 లో రావికమతం ఎంపీడీవో బృందం గ్రామాన్ని సందర్శించి సమస్యలను ధ్రువీకరణ చేసి జిల్లా అధికారులకు నివేదిక అందించారు. 2022 లో పాడేరు ఐటీడీఎ పీవో రోనంకి గోపాలకృష్ణ స్వయాన నేరేళ్ళ బంధ గ్రామాన్ని సందర్శించి విద్యుత్, తాగునీరుతో పాటు ఆధార్ కార్డులు జారీ కి చొరవ చూపారు....

2025 లో జిల్లా కలెక్టర్ ఆదివాసీ గిరిజనులు సమస్యలపై స్పందించి జెడ్ జోగంపేట నుండి నేరేళ్ళ బంద వరకు రహదారి సౌకర్యం నిమిత్తం సుమారు రూ 2 కోట్ల 50 లక్షల ఉపాధి హామీ పథకం, డిపిసి నిధులు మంజూరు చేశారు..



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి,ఎస్ రాయవరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో సుమారుగా 500 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ, పరీక్షల పట్ల వారిలో నెలకొన్న భయాందోళన పోగొట్టేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శిరీష, అశ్విని, ప్రసాద్, కృష్ణ, నూకరాజు, సురేష్, సిద్దు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ చేస్తున్న ఎఇ

## రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగంపేట సచివాలయంలో శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి కే.సుధారాణి ఆధ్వర్యంలో భూఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూమి ఆన్ లైన్ నమోదు అవ్వని రైతులు భూ ఆధార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఈ నెల 25వ తేదీలోపు చేయించుకోవాలని చెప్పారు. లేనిచో ప్రభుత్వ పథకాలు అందవని స్పష్టం చేశారు.

## నేడు16 కేంద్రాల్లో గ్రూప్ 2 పరీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపిపిఎస్సి) గ్రూప్ 2 మెయిన్స్ రాత పరీక్షలు ఆదివారం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష ఉంటాయన్నారు. విశాఖపట్నంలో 11,029 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అందుకోసం 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈసరికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

# కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు

## అనకాపల్లి డిఎస్పి శ్రావణి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిఎస్పి

ప్రజాశక్తి -కొత్తకోట:మహాశివరాత్రి సందర్భంగా కళ్యాణపులోవలో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించే పోతురాజు బాబు తిరునాళ్ళు కు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె కళ్యాణపులోవను సందర్శించారు. పోతురాజు బాబు ఆలయం, పెద్దింటి అమ్మ తల్లి, పుణ్య స్థానాలు ఆచరించే జలాశయాన్ని పరిశీలించారు. జాతరకు భక్తులు ఎంతమంది వస్తారు, ఎక్కడ నుంచి ఎక్కడ వరకు ట్రాఫిక్ ఉంటుందో కొత్తకోట సీఐ కోటేశ్వరావును అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూ లల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, దొండపూడి చెక్ పోస్ట్ నుంచి ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మూడు రోజులపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, వాహనాలు భక్తులు వెళ్లేందుకు ట్రాఫిక్ కి ఇబ్బందులు లేకుండా చూడాలని, స్టాఫర్ లు ఏర్పాటు చేయాలని, జలాశ యం లో స్నానాలు చేసే వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని,హెచ్చరిక బోర్డులు బారికేడ్లు ఏర్పాటు చేయాలని సీఐ కోటేశ్వరరావు కు సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రమణ

## రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం ఆర్డీఓ వివి.రమణ శనివారం గొలుగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. అనంతరం రెవెన్యూ సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనుల భూములను కాపాడాలి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ శివారు చంద్రయ్యపాలెంలో గిరిజనుల భూములకు రక్షణ కల్పించి కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు పిఎస్.అజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు గిరిజనులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. అనంతరం అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసీ భూములు గిరిజనేతరులకు చెందకుండా చూడాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఎన్నో ఏళ్ల బట్టి ఆదివాసీలు సాగులో ఉన్నారన్నారు. భూ రికార్డులలో పేర్లు మారాయన్నారు. ఇప్పటికైనా అధికారులు లబ్ధిదారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న అజయ్ కుమార్

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి రావికమతం:మరుపాక ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ . కె.సత్య సునీల్ తెలిపారు .ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, 2025-26 ఏడాదిలో పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయబడుతుందని తెలిపారు. ఈనెల 25 నుంచి మార్చి 31 వరకు ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఓసి, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు 150 రూపాయలు, ఎస్సీ ,ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు 50 రూపాయల చొప్పున ఆన్లైన్లో ఫీజు చెల్లించి ఏప్రిల్ 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ఆయన తెలిపారు. 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదర్శ పాఠశాలకు ఆరవ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. ఈ పరీక్షలలో మెరిట్ పొందిన విద్యార్థులకు స్థానికత ఆధారంగా దృష్టిలో పెట్టుకొని నియామకం చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థులు 1-9-2013 నుండి 31-8-2025 మధ్య జన్మించి ఉండాలన్నారు. విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# చెత్త సేకరణకు స్పెషల్ డ్రైవ్



చౌడువాడలో చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-కె.కోటపాడు:మండలంలోని చౌడువాడ పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించనున్నట్లు చెప్పారు. రోడ్ల పైనా, వీధుల్లోనూ చెత్త వేయకుండా తమకు అందజేసిన ప్లాస్టిక్ గిన్నెలలో వేయాలని సూచించారు. ఈ చెత్తను పంచాయతీ సిబ్బంది సంపద కేంద్రాలకు తరలిస్తారని, వాటి ద్వారా కొంత ఆదాయం పొందడంతోపాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిత రాయబారులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం :** స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం మండలంలో 34 గ్రామపంచాయతీలోనూ ప్రతి ఇంటి వద్ద నుంచి శనివారం చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్త రిక్షాలను ప్రతి ఇంటి వద్దకు తీసుకెళ్లి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించారు. ఈవోపిఆర్‌డి చందక నాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**కోటవురట్ల:**గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత ప్రధాన లక్ష్యంగా రెండు రోజుల పాటు ఇంటింటికి చెత్త సేకరణ నిర్వహిస్తున్నట్లు ఈఓపిఆర్డి రఘురాము తెలిపారు. మండల వ్యాప్తంగా రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారాలు కమిషనర్ ఆదేశాల మేరకు సేకరిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా పశువుల పెంటను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**గొలుగొండ:**మండలంలోని దారమట్లం వద్ద స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ శనివారం నిర్వహించారు. దారమట్లం పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. మండల ప్రత్యేక అధికారి శామ్యూల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నక్కపల్లి:**మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాల్లో శనివారం ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఈఓపిఆర్‌డి ఎం.శ్రీను మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించడం కోసం రెండు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా శనివారం ప్రతి ఇంటి నుండి చెత్తను బయట వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించి, తడి, పొడి చెత్తను కార్మికులతో సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.



నక్కపల్లిలో చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

## కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా రోడ్డు

ప్రజాశక్తి-రోలుగుంట:చిన్నపాటి వర్షానికే రోలుగుంట మెయిన్ రోడ్డు చిత్తడి చిత్తడిగా మారిపోయింది. శనివారం సాయంత్రం ఇక్కడ కొద్ది సేపు చిన్నపాటి వర్షం పడింది. అసలే అధ్వాన్నంగా ఉన్న ఈ రహదారిలో కురిసిన వర్షానికి గోతుల్లో నీరు చేరి మరీ దారుణంగా కనిపిస్తుంది. దీంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. తక్షణమే ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



చిత్తడిగా మారిన రోడ్డు

# వెంకన్న ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

## - హోం మంత్రి వంగలపూడి అనిత

**ప్రజాశక్తి -నక్కపల్లి:** ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్వామివారి వార్షిక కళ్యాణ మహెూత్సవాలు మార్చి 9వ తేదీన అంకురార్పణతో ప్రారంభమై 17 వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయి. 10వ తేదీన ధ్వజారోహణం, రథోత్సవం, కళ్యాణ మహెూత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు శనివారం సాయంత్రం హెూం మంత్రి అనిత ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. పుష్కరిణి, అన్న సమారాధన జరుగు ప్రాంతం, ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్లు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, కూటమి నాయకులతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి, ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి టీటీడీ చైర్మన్‌తో మాట్లాడడం జరిగిందన్నారు. ఉత్సవాలు వైభవంగా నిర్వహించ డానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరిణిలో భక్తులు స్థానాలు ఆచరించేందుకు జల్లు స్నానం ఏర్పాటు చేయాలని సూచించారు. బయో టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. స్వామివారి కళ్యాణం తిలగించేందుకు బిగ్ స్క్రీన్ లు ఏర్పాటు చేయాలన్నారు. వీఐపీ దర్శనాలకు ఒక సమయం కేటాయించాలని, ఆ సమయంలో మాత్రమే, సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. భక్తులకు వాటర్ బాటిల్, మజ్జిగ, ప్రసాదాలు సరఫరా చేసే విధంగా చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. తప్పెడ గుల్ల కళాకారుల ప్రదర్శన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని, వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యేలకు, జిల్లా అధికారులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, కూటమి నాయకులు నూకరాజు, గెడ్డం బుజ్జి, శివ దత్, పెంకుల రాజు, గోవిందరావు, వెలగా శ్రీను, దేవర సత్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీను, దొరబాబు, తోలేటి శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

### హో మంత్రికి బాధితుల వినతి

**నక్కపల్లి :**నక్కపల్లిలో క్రిష్ టౌన్షిప్‌లో శనివారం హెూం మంత్రి వంగలపూడి అనితకు పలువురు బాధితులు వినతిపత్రం అందజేశారు.కోడి కత్తి శ్రీను కుటుంబం, సెంట్రల్ జైల్లో కస్టోడియల్ డెత్ ఉప్పాడ గౌరీ శంకర్, వెంకటాయపాలెం శిరో మండనం, వీధి సుబ్రమణ్యం కుటుంబాల సభ్యులు తమ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు.పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశిస్తానని బాధితులకు హెూం మంత్రి అనిత హామీ ఇచ్చారు.


ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకుంటున్న అనిత

### ఎపియుడబ్ల్యుజె డైరీ ఆవిష్కరణ

**నక్కపల్లి:**ఏపీయూడబ్ల్యూజే 2025 సంవత్సరం డైరీ ని శనివారం ఉపమాక లో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత చేతులమీదుగా పాయకరావుపేట ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు నాయకత్వంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాస్ కుమార్, గౌర అధ్యక్షులు సత్యనారాయణ, సీనియర్ పాత్రికేయులు దవరసింగి రాంబాబు, రమేష్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న యువకులు

## తాగునీటి సమస్యపై ఆందోళన

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని పెదతీనార్ల పంచాయతీ దొండవాక గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ యువకులు డిమాండ్ చేశారు. చేతి బోరు మరమ్మత్తుకు గురైందని, వెంటనే అధికారులు స్పందించి వాడుకలోకి తీసుకు రావాలన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి నెల కొనడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి తాగునీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి నెల కొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మైలపల్లి అమ్మోరయ్య, కోడ కృష్ణ, మైల పల్ల నవీన్, రంగాల అర్జున్, మైలపల్లి మున్నా పాల్గొన్నారు.


బోర్లు ప్రారంభిస్తున్న సర్పంచ్

## తాగునీటి బోర్లు ప్రారంభం

**ప్రజాశక్తి-రావికమతం:** మండల కేంద్రంలో గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన చేతి బోర్లను శనివారం సర్పంచ్ గెంజి మోది నాయుడు మంగ ప్రారంభించారు. వేసవికాలం కావడంతో ప్రజలకు మంచినీటి సౌకర్యాన్ని అందించే దిశగా మండల కేంద్రంలో రెండు మంచినీటి బోర్లను ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామంలో మంచినీటి కి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో గ్రామపంచాయతీ నిధులతో 6వ వార్డు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, 7వ వార్డులోని మేదర్ల కాలనీ వద్ద మరొక బోరులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గొంప ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ, వార్డు మెంబర్లు ఉప్పులూరి నాగేశ్వరరావు, నాగరాజు, బ్రహ్మానందం, ఒంపోలు ఆచారి, నక్క ప్రకాష్, రామానాయుడు, చుక్కా రాము, శివ, కృష్ణమాచారి పాల్గొన్నారు.

## ఆదేశిక సూత్రాలను అమలు చేయాలి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:**దేశంలో పెరిగిపోతున్న దారిద్రం, నిరుద్యోగం, తక్కువ వేతనాలు, ఉపాధి లేక లక్షలాది మంది వలసలు, పంటలు పండక రైతుల ఆత్మహత్యలు, కార్మిక వర్గం పడుతున్న కష్టాలు గుర్తించడంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి గుర్తించక పలు వ్యాఖ్యలు చేయడంపై భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ కన్వీనర్ జె.రవి, కేంద్ర నాయకులు టి. శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో ఖండించారు.రాజ్యాంగం అధికరణ 38 లో సంక్షేమ పథకాలు అమలు చేయాలని అంబేద్కర్ పేర్కొన్నారని, ఆదేశిక సూత్రాలలో ఉన్నవి అమలు చేయడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని, ఉచితాలతో ప్రజలు పనిచేయడానికి ఇష్టపడరని, పరాన్న జీవులుగా (పారాసైట్స్) మారుస్తున్నామని న్యాయమూర్తి సందేహం వ్యక్తం చేయడం పట్ల నిరసన తెలియజేస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, ఇతర కార్మికులు పనిచేయకుండానే రెండు లక్షల కోట్లు జిడిపి వచ్చిందా అని,33 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు పనిచేయకుండానే ఉత్పత్తి అయ్యాయా అని ప్రశ్నించారు. న్యాయమూర్తుల వ్యాఖ్యలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని, తన వ్యాఖ్యలను పునర్ సమీక్షించుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# ఒత్తిడిని అధిగమిస్తే పరీక్షల్లో విజయం

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:**పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి, విజయం సాధించాలని చైల్డ్ అండ్ సైకియాట్రీ స్పెషలిస్ట్ డాక్టర్ వి.మానస్‌రామ్ హితబోధ చేశారు.శనివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో పెన్ స్కూల్ ఆధ్వర్యంలో "ఒత్తిడిని అధిగమించి, తద్వారా పరీక్షల్లో ఎలా విజయం సాధించాలి" అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పెన్ స్కూల్స్ కరస్పాండెంట్ అనిత పెరీరా, వి.మానస్ రామ్ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మానస్ రామ్ మాట్లాడుతూ, కెరీర్ కౌన్సిలింగ్,మొబైల్ వాడకాన్ని ఎలా తగ్గించుకోవాలి,తోటి వారితో ఎలా మెలగాలి, ఏ టైం లో రిలాక్స్ అవ్వాలి వంటి అంశాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో 9,10వ తరగతి చదువుతున్న సుమారు 1000 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సైకియాట్రీ స్పెషలిస్ట్ మానస్‌రామ్

## అల్లూరి జిల్లా కలెక్టర్‌కు వినతి

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:**అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం (విశాఖ పట్నం) జిల్లా కార్యవర్గం శనివారం కలిసింది. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని, డిస్టెన్స్ మోడ్‌లో పిజి సెంటర్ ని, బి.ఎడ్ కాలేజీని అల్లూరి జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరారు. కేజీహెచ్ లో ఎస్టి సెల్ ఉద్యోగులకు కార్యాలయం , రోగుల బంధువులకై ఒక నివాస యోగ్యమైన భవనాన్ని నిర్మించాలని కోరారు. పోర్ట్ అథారిటీ సిఎస్ఆర్ నిధుల ద్వారా రెండు అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సొనాయి అప్పల రాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్, ఎం.ప్రసాదరావు, రామలింగం, సీసా శోభన్, జె.రాము, కే.ప్రసాదరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సైన్స్ నమూనాల ప్రదర్శన


నమూనాను పరిశీలిస్తున్న అధ్యాపకులు

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**మండలంలోని చెట్టు పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 6 నుంచి 10 తరగతి విద్యార్థులు 98 నమూనాలను ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్మన్ పి.ఈశ్వరరావు ఈ ప్రదర్శనను ప్రారంభించగా రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కే.శ్రీనివాసరావు, ఎల్.తులసి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ నెల 28న విజేతలకు బహుమతులు అందజేస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ.రాజగోపాల్, రాఘవ నాయుడు, నిండుగొండ, చెట్టుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు సామగ్రి వితరణ

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌కు నర్సీపట్నం క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు శనివారం మూడు స్టీల్ సీటర్ సోఫాలు, ఐదు బారికేడ్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ మాట్లాడుతూ, బారికేడ్లు, సోపాలు అందజేయడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై రాజారావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



సామగ్రిని ఇస్తున్న కంపెనీ ప్రతినిధులు